సీహెచ్ పౌడర్ రవాణా చేస్తున్న వ్యక్తుల అరెస్ట్

రాయచూరు, ఆగస్టు 20 : అక్రమ కల్తీకల్లు తయారీ కోసం ఉపయోగించే సీహెచ్ పౌడర్‌ను రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు మంగళవా రం అరెస్టు చేశారు. రాయచూరు తాలూకాలోని బాపూరు గ్రామం నుంచి నగ రం వైపు వస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి ఆరు కిలోల సీహెచ్ పౌడర్‌ను స్వాధీ నం చేసుకుని నిందితులిద్దరిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న సీహెచ్ పౌడర్‌ను ఎస్పీ పుట్టమాదయ్య పరిశీలించారు. పట్టుబడిన వారిలో నగరానికి చెందిన హంపయ్య, నారాయణ ఉన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు యరగేరా పోలీసులు తెలిపారు.

బీజేపీలో అసమ్మతి సెగ


విజయేంద్ర

- విజయేంద్ర తీరుపై ఓ వర్గం నిరసన
- కమలంలో ముదిరిన విభేదాలు
- పోటీపాదయాత్రకు అసమ్మతి నేతల సన్నద్ధం
- పరిణామాలపై జేడీఎస్ అసంతృప్తి
- నేడు ఢిల్లీకి రావాలని జార్కిహొళి, యత్నాల్‌కు అధిష్టానం పిలుపు

బీజేపీలో అసమ్మతి రాజుకుంటోంది. సీనియర్ నేత యడియూరప్ప, ఆయన తనయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తీరును మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న కొందరు నాయకులు జట్టుకడుతున్నారు. విజయేంద్రను వ్యతిరేకిస్తున్న వారు ఒక కూటమిగా ఏర్పడి బెళగావిలోని ఓ రిసార్టు వేదికగా సమావేశం నిర్వహించారు. దీనిపై అధిష్టానం కూడా దృష్టి సారించి వెంటనే రంగంలోకి దిగింది. నష్టనివారణ చర్యలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే అసమ్మతి నేతలుగా ముద్రపడిన ఎమ్మెల్యేలు బసనగౌడ పాటిల్ యత్నాళ్, రమేశ్ జార్కిహోళిని బుధవారం ఢిల్లీకి రావాల్సిందిగా ఆదేశించింది. వారితో అగ్రనేతలు ఏమి చర్చిస్తారో అన్నది ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.


ఒప్పంద రాజకీయాలతో బలయ్యా : సీటీ రవి

రాష్ట్రంలో ఒప్పందపు రాజకీయాల గురించి సుదీర్ఘ చర్చలు జరిగాయని బీజేపీ నేత సీటీ రవి తెలిపారు. డీల్ రాజకీయాలతోనే తాను బలిపశువు అయ్యానని వాపోయారు. పార్టీకి తీరనినష్టమని, నిజాయితీగా పార్టీకోసం పోరాడేవారు దెబ్బ తింటున్నారన్నారు. తాను కూడా బలిపశువేనని, తాను రాజీ కానందుకే అన్ని పార్టీలు కలసి తనను ఓడించాయని అన్నారు. ప్రజాభిమానం ఉన్నా కుట్ర రాజకీయాలకు బలయ్యానన్నారు. తాత్కాలికంగా ఇటువంటి రాజకీయాలతో సంబరమనిపించినా దీర్ఘకాలంలో పార్టీ మనుగడకు ప్రమాదకరని హెచ్చరించారు.


బసనగౌడ పాటిల్ యత్నాళ్

బెంగళూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 'ముడా' ఇంటి స్థలాల వ్యవహారంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యను టార్గెట్ చేసుకుని బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో మైసూరు విజయవంతమైందని భావిస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రకు అసమ్మతి పోరు ఎదురవుతోంది. పార్టీ ఆధ్వర్యంలో ఎనిమిదిరోజులపాటు బెంగళూరు నుంచి మైసూరుకు పాదయాత్ర చేపట్టడం ద్వారా ప్రభుత్వ అవినీతిని ఎండగట్టారు. తొలిరోజు కెంగేరి సభకు పార్టీ అగ్రనేత యడియూరప్ప, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ అగర్వాల్, కేంద్రమంత్రి కుమారస్వామి, ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామితోపాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు. దాదాపు ప్రతిరోజూ సభల్లోనూ కేంద్రమంత్రి కుమారస్వామి భాగస్వామ్యులై ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే లాంటి అంశాలను తెరపైకి తెచ్చారు. ఎనిమిదిరోజుల పాదయాత్ర ద్వారా వేలాదిమంది కార్యకర్తల్లో చైతన్యం తీసుకొచ్చామని, పార్టీకి కొత్త శక్తి వచ్చిందని భావించారు. పాదయాత్ర ముగియగానే గ్రూపు విభేదాలు తారస్థాయికి చేరాయి. ముఖ్యమంత్రిపై ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వడం, ఆ తర్వాత కాంగ్రెస్ ఆందోళనలు కోర్టుద్వారా పదిరోజుల ఉపశమనంతో సీఎం సిద్దరామయ్యకు కాస్త ఊరట లభించింది. కానీ నిరసనల వేళ గవర్నర్ పట్ల కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన విధానాలను వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేయాలనుకుంటున్న తరుణంలోనే సొంతపార్టీలో ముసలం ఇబ్బందికరంగా మారుతోంది. ఇప్పటి వరకు బీజేపీలో ఎన్నడూలేని విధంగా రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రను వ్యతిరేకిస్తున్న వారు ఒక కూటమిగా ఏర్పడి బెళగావి రిసార్టు వేదిక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్, మాజీ మంత్రులు రమేశ్ జార్కిహోళి, అరవింద లింబావళి, మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ, అన్నా సాహెబ్‌జొల్లె, కుమార బంగారప్ప, జీఎం సిద్దేశ్వర్, బీపీ హరీశ్, ఎన్ఆర్ సంతోష్ పాల్గొన్నారు. 'ముడా' అవినీతిపైనే సీఎంను టార్గెట్‌గా చేసుకుని పాదయాత్ర సాగిందని వ్యతిరేక కూటమి మండిపడింది. ఉత్తర కర్ణాటకలో వాల్మీకి సామాజికవర్గానికి చెందిన వేలాది మందికి కార్పొరేషన్ ద్వారా రావాల్సిన సాయం దారి తప్పిందని మండిపడ్డారు. ముడా కంటే వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో సాగిన అవినీతి దేశవ్యాప్తంగా చర్చకు కారణమైందన్నారు. ఈ అవినీతిపై కూడలసంగమ నుంచి పాదయాత్ర చేసేలా తీర్మానించారు. కార్పొరేషన్‌కు చెందిన రూ.187 కోట్లలో రూ.89 కోట్లు నగదు బదిలీ చేసి హైదరాబాద్‌లోని ప్రైవేట్ బ్యాంకుల ద్వారా బళ్లారికి చెందిన బినామీల ఖాతాలకు మళ్లించడంతో 12మందికి పైగా అరెస్టు అయ్యారు. ఏకంగా మంత్రి నాగేంద్ర పదవికి రాజీనామా చేశారు. కార్పొరేషన్ చైర్మన్ కూడా ఇరుక్కున్నాడు. సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఇటువంటి కీలకమైన అంశాన్ని వదిలారని కూడా అభిప్రాయపడ్డారు.


ఇటీవల బెళగావిలో బీజేపీ అసమ్మతి నేతల సమావేశం


యడియూరప్ప

కమలంలో గ్రూపు విభేదాలు.. జేడీఎస్ అసంతృప్తి

లోక్‌సభ ఎన్నికలకు ముందే బీజేపీతో మైత్రి ఏర్పాటు చేసుకున్న జేడీఎస్ పార్టీ ఆరునెలలుగా సమన్వయంగా కొనసాగుతోంది. ఇటీవల కమలదళంలో గ్రూపు విభేదాలు తారస్థాయికి చేరడంతో జేడీఎస్ అసంతృప్తికి లోనవుతోంది. బీజేపీ అంతర్గత వ్యవహారాల్లో జేడీఎస్ ఇప్పటివరకు జోక్యం చేసుకోకపోయినా భవిష్యత్తులో తమ పార్టీ నాయకులపైనా విమర్శలు చేయరని భావించలేమని డోలాయమానంలో పడింది. పార్టీలో తలెత్తిన విభేదాలపై ఢిల్లీ పెద్దలకు వివరించే ఆలోచనలో కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రమంత్రులు ప్రహ్లాద్‌జోషి, శోభాకరంద్లాజె, సోమణ్ణ ఇదే విషయమై ఇప్పటికే చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. కేంద్రమంత్రులలో శోభాకరంద్లాజె, విజయేంద్రకు అనుకూలంగా ఉండగా సోమణ్ణ వ్యతిరేకంగా ఉన్నారు. ఇక జోషి ఆచితూచి వ్యవహరిస్తున్నారు.

సెప్టెంబరు 17న పాదయాత్ర

విజయేంద్రను వ్యతిరేకిస్తున్న కూటమి ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ నేతృత్వంలో వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతిని నిరసిస్తూ సెప్టెంబరు 17నుంచి పాదయాత్ర చేస్తామని మైసూరు మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ తెలిపారు. ఇప్పటి వరకు ఎవరిని ఆహ్వానించాలనేది నిర్ణయించలేదన్నారు. తాను ఎవరికోసమో రాజకీయాలు చేయనని, తనకు టిక్కెట్ ఇచ్చింది ఆర్ఎస్ఎస్ అన్నారు. నియోజకవర్గం, కులాలతో సంబంధం లేకుండా ప్రజాభిమానం కల్గిన యత్నాళ్ వంటి వారిలో తానొకడిని అన్నారు. మైసూరులోనే ఉంటానని, పాదయాత్ర ఎవరికోసమో చేయడం లేదని, గ్రూపు రాజకీయం కూడా కాదన్నారు.

జార్కిహొళి, యత్నాళ్‌కు అధిష్టానం పిలుపు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రకు వ్యతిరేక కూటమిగా ఏర్పడి బెళగావి రిసార్టులో సమావేశం నిర్వహించి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతిపై పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించడంపై అధిష్టానం స్పందించింది. ఎమ్మెల్యేలు బసనగౌడ పాటిల్ యత్నాళ్, రమేశ్ జార్కిహొళిని ఈనెల 21న ఢిల్లీకి రావాలని అధిష్టానం ఆదేశించింది. పార్టీ అగ్రనేతలు ఎలాంటి ఆదేశాలు చేస్తారనేది కుతూహలంగా మారింది. విజయేంద్ర, యడియూరప్పపై అసమ్మతి నేతలు ఎలాంటి ఫిర్యాదులు చేస్తారనేది కూడా ఉత్కంఠగా మారింది. మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ, సిద్దేశ్వర్, అన్నాసాహెబ్ జొల్లె, అరవింద లింబావళితోపాటు పలువురు ఉన్నారు. ముడా అక్రమాలను నిరసిస్తూ విజయేంద్ర సారథ్యంలో చలో మైసూరు పాదయాత్ర తరహాలోనే వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతిని ఎండగడుతూ కూడల సంగమ నుంచి చలో బళ్లారి పాదయాత్రకు నిర్ణయించారు. పరిస్థితి తారస్థాయికి చేరకముందే అధిష్టానం స్పందించింది. అధిష్టానాన్ని సంప్రదించకుండానే బలాన్ని నిరూపించుకునే తరహాలో పాదయాత్రకు సిద్ధం కావడాన్ని తీవ్రంగా పరిగణించనున్నట్లు తెలుస్తోంది. బెంగళూరులో మరోసారి భేటీ కావాలనుకున్నా ఆర్ఎస్ఎస్ సూచన మేరకు వాయిదా వేసుకున్నారు.


రమేశ్ జార్కిహోళి

నగరంలో పలుచోట్ల వర్షం



బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం మధ్యాహ్నం పలుచోట్ల వర్షం కురిసింది. సదాశినగర్ ప్రాంతంలో వెళ్తున్న కారుపై అకస్మికంగా చెట్టు కూలిపోయింది. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. చెట్టు రోడ్డుపై పడిపోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వెంటనే రంగంలోకి దిగిన బీబీఎంపీ ప్రత్యేక సిబ్బంది చెట్టుకొమ్మలు తొలగించి ట్రాఫిక్‌కు వీలు కల్పించారు. పలుచోట్ల రోడ్లపై వర్షపునీరు నిలవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు.





కడుపుమంటతో ప్రతిపక్షాల ఆరోపణలు

- మండిపడ్డ ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఐదు గ్యారెంటీల ద్వారా తమ ప్రభుత్వం ప్రజామన్ననలు పొందడాన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ నేతలు కడుపు మంటతో ఆరోపణలు చేస్తున్నారని ముఖ్యమంత్రి సిద్దరామయ్య మండిపడ్డారు. మంగళవారం కేపీసీసీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 80వ జయంతి, డాక్టర్ దేవరాజ్ అరసు 109వ జయంతి వేడుకలు నిర్వహించారు ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ వారిద్దరి జీవితాలు సమాజానికి ఆదర్శనీయం అన్నారు. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఆధునిక భారత్ కలలుగన్నారని, యువతపై అపారమైన విశ్వాసం పెట్టుకున్నారని, దేశంలో ఐటీబీటీ ప్రగతికి బాటలు వేశారని తెలిపారు. దేశంలో మార్పు రావాలని, సమాన అవకాశాలు లభించాలని ఆకాంక్షించారని అన్నారు. కుల, మత ప్రాంతీయ భేదాలు లేకుండా భారతీయులంతా సమైక్యంగా ఉండాలని భావించారని తెలిపారు. మహిళలు రాజకీయరంగంలో రాణిస్తేనే సమసమాజం సాధ్యమని రాజ్యాంగ సవరణలు చేశారని గుర్తుచేశారు. దేశమంతటా మహిళలకు రాజకీయంగా పదవులు దక్కేందుకు రాజీవ్ చేసిన సవరణలే కారణమని అన్నారు. బీజేపీ వారు బీసీ, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీల తరఫు ఉన్నామని ఎంతగా చెప్పుకున్నా పేద, దళిత, బీసీ వర్గీయులు వారిని విశ్వసించరని తెలిపారు. రాజీవ్‌గాంధీ ఇంకా జీవించిఉంటే మరిన్ని మార్పులు సాధ్యమయ్యేవన్నారు. దేవరాజ్ అరసు సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా వ్యవహరించారన్నారు. బీసీలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత ఆయనదే అన్నారు. వెట్టిచాకిరీ, మలం గంపల్లో మోసుకుపోయే పద్ధతిని రద్దు చేశారని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు రామలింగారెడ్డి, కేజే జార్జ్ తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీ, దేవరాజ్ అరసు చిత్రపటాలకు సీఎం పుష్పాంజలి

కేంద్రం నుంచి పన్నుల వాటా కోసం కసరత్తు

- నిపుణుల సలహాలతో తుది మెరుగులు
- 28 నుంచి రాష్ట్రంలో 16వ ఫైనాన్స్ కమిషన్ పర్యటన

బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి పన్నుల వాటాలను పూర్తిస్థాయిలో రాబట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ కసరత్తు చేస్తోంది. 16వ ఫైనాన్స్ కమిషన్ నెలాఖరున రాష్ట్రంలో పర్యటించనుంది. కేంద్రప్రభుత్వ వాటాల్లో ఎక్కువ భాగం కోరేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తున్న ప్రతిపాదనలు తుది దశకు చేరుతున్నాయి. కేంద్ర పన్నుల వాటాలో కనీసం 4-4.5 శాతం కేటాయింపులు కోరేందుకు సమగ్ర నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఎంఆర్ శ్రీనివాసమూర్తి నేతృత్వంలో నిపుణుల కమిటీ ఏడెనిమిది సమావేశాలు నిర్వహించి పలు సలహా, సూచనలు ఇచ్చింది. వాటికి అనుగుణంగానే నివేదికలు సిద్ధం చేస్తున్నారు. 16వ ఫైనాన్స్ కమిషన్ ఈనెల 28 నుంచి మూడు రోజులపాటు అరవింద్ బనగారియా నేతృత్వంలో రాష్ట్రంలో పర్యటించనుంది. 29న సీఎం సిద్దరామయ్య కమిషన్‌కు ప్రతిపాదనలు అందించనున్నారు. వీటితోపాటు రాష్ట్రంలోని సమస్యలు, సవాళ్లకు సంబంధించి కూడా ఆయనే వ్యక్తిగతంగా వివరించనున్నారు. రాష్ట్రానికి న్యాయబద్ధంగా లభించాల్సిన పన్నుల వాటా ప్రాధాన్యతను వివరించనున్నారు. కమిషన్ రాష్ట్రంలోకి రాకముందే ప్రతిపాదనల నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. 16వ ఫైనాన్స్ కమిషన్‌కు సమర్పించే సిఫారసులు 2026 ఏప్రిల్ నుంచి అమలు కానున్నాయి. కేంద్ర, రాష్ట్రాల మధ్య పన్నుల పంపిణీకి సంబంధించి కమిషన్ ఐదేళ్ల వ్యవధికి సిఫారసు చేయనుంది. ఇందుకోసమే ప్రత్యేకంగా రాష్ట్రంలో పర్యటించనుంది. 14వ ఫైనాన్స్ కమిషన్ కర్ణాటకకు 4.7 శాతం పన్నుల వాటా పంపిణీకి సిఫారసు చేసింది. 15వ ఫైనాన్స్ కమిషన్ 3.64 శాతం మాత్రమే నిర్ధారించింది. తద్వారా కేంద్రం రాష్ట్రాలకు పన్నుల వాటాలో భారీగా కోత పెట్టింది. కేంద్రం తీరును రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. 2013-18 మధ్య కాలంలో సీఎం సిద్దరామయ్య పాలనలో 15వ ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రంలో పర్యటించింది. అప్పుడు సమగ్రమైన సమాచారం ఇవ్వని కారణంగానే పన్నుల వాటా తగ్గుముఖం పట్టిందని బీజేపీ అభిప్రాయపడింది. ఇలా రాజకీయ విమర్శలకు కారణమైంది.



నిపుణులతో సంప్రదింపులు


రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ శాతం పన్నుల వాటాను సాధించుకునేందుకు ఫైనాన్స్ కమిషన్ నుంచి సానుకూలం పొందేలా పలు అంశాలను ప్రస్తావించేలా నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. మాజీ ఐఏఎస్ అధికారి ఎంఆర్ శ్రీనివాసమూర్తి, 14వ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు గోవిందరావు, జాతీయ ఉన్నత అధ్యయన సంస్థ, సామాజిక విజ్ఞాన విభాగాల డీన్ నరేంద్రపాణితో కూడిన కమిటీ నిరంతరంగా సమావేశాలు నిర్వహించింది. అధికారులతో ఏడెనిమిది సమావేశాలు జరిగాయి. రాష్ట్రానికి ఎక్కువ పన్నుల వాటా సాధించేదిశగా కమిటీ పలు సలహాలు సిద్ధం చేసింది. గణాంకాల విశ్లేషణ, సమస్యలు వివరించాల్సిన విధానం, రాష్ట్రంలో గమనించదగ్గ అంశాలు, విశ్లేషణలు, నివేదికలో పొందుపరిచారు. వాటా పంపిణీకి సంబంధించి మార్గదర్శకాలను పొందుపరిచారు. కర్ణాటక స్థితిగతుల విశ్లేషణ, రాష్ట్రం నుంచి కేంద్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో అందుతున్న ఆదాయం, రాష్ట్రానికి దక్కాల్సిన వాటా, అందుకు సమర్థనీయ అంశాలను కమిటీ చర్చించింది. ప్రత్యేక కమిటీ రాష్ట్ర ఉన్నతాధికారులతో పన్నుల వాటా శాతం పెంచుకోవడం, న్యాయబద్ధంగా ఎక్కువ వాటాలను ఏ విధంగా సాధించుకోవచ్చునని అనే అంశాలపై చర్చించింది. 14వ ఫైనాన్స్ కమిషన్‌లో ఇచ్చిన వాటాలనైనా సాధించుకోవాలన్నదే కీలకంగా ఉంది. 14వ ఫైనాన్స్ కమిషన్‌లో 4.7శాతం పన్నులవాటా ఉండేది. 15వ ఫైనాన్స్ కమిషన్‌లో 3.64కు తగ్గిపోవడంతో రాష్ట్రానికి పన్నులవాటాలో అన్యాయం జరిగిందని, 16వ ఫైనాన్స్ కమిషన్‌లో కనీసంగా 14వ ఫైనాన్స్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలనేది వీరి ప్రధాన డిమాండ్‌గా ఉంది.

శరావతి ప్రాజెక్టు వద్దు

- పశ్చిమ కనుమలను రక్షించండి
- సీఎంకు మేధావుల లేఖ

బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు మహానగరానికి తాగునీటిని సమకూర్చేందుకు రాష్ట్రప్రభుత్వం శరావతి నదిపై దృష్టి సారించింది. రాజధానికి 380 కిలోమీటర్ల దూరంలో ఉండే శరావతి నది నుంచి నీటిని తరలించాలని గతంలో లేవనెత్తిన అంశాలను మరోసారి తెరపైకి తీసుకొస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత అపురూపమైన వైవిధ్యమైన పశ్చిమకనుమల ప్రాంతంలో ప్రవహించే శరావతి నది నుంచి నీటిని తరలించాలనే అధికారుల నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మేధావుల బృందం ముఖ్యమంత్రికి లేఖ రాసింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ శాస్త్రవేత్తలు దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నా డిసౌజా, మూలగెద్దె అభినవ చన్నబసవస్వామిజీ, డాక్టర్ బంజగెరె జయప్రకాశ్, డాక్టర్ పురుషోత్తమ బిళిమలె, డాక్టర్ రాజేంద్ర చిన్ని, అక్షతా హుంచదకట్టె, డాక్టర్ హెచ్ఎస్ అనుపమ శారదాగోపాల్, నాగేశ్‌హెగ్డే, రహమత్ తరికెరెలతో కూడిన మేధావుల బృందం శరావతి నదిని రక్షించాలని పోరాటానికి సిద్ధమయింది. ఐదేళ్ల క్రితం ప్రభుత్వం శరావతి నుంచి నీటిని మళ్లించాలని భావించింది. అప్పట్లో పలు కారణాలతో వాయిదా పడింది. లయన్ టేల్డ్ మకాక్ సురక్షిత అభయారణ్యానికి అనుబంధంగా ఉండే జీవవైవిధ్యానికి భారీ ఆటంకం కలుగుతుందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టు అమలు చేస్తే వేలాది ఎకరాలలో అటవీ ప్రాంతం, రైతుల భూములకు నష్టం కలుగుతుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు. జీవనదిగా పేరొందిన శరావతి నది నుంచి బెంగళూరుకు నీరును తరలించాలనడం శాస్త్రీయం కాదని, అడవులు, పంటలు నాశనం అవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతిపై దాడి చేస్తే ఎలా ఉంటుందో కేరళ రాష్ట్రం వయనాడ్ దారుణం కనులారా చూశామని, అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పశ్చిమకనుమలపై గొడ్డలిపెట్టులాంటి పథకాలు తీసుకురావడం సరికాదన్నారు. శరావతి నీటిని తరలించే ప్రాజెక్టును వదులుకోవాలని కోరుతున్నారు. బెంగళూరుకు అవసరమైన 15 టీఎంసీల నీటిని నగరంలోనే వర్షపునీటిని ఇంకించడం, చెరువుల పునరుద్ధరణ వంటివి ఆలోచన చేయాలని సూచించారు. ప్రభుత్వం వెంటనే శరావతి నీటిని తరలించేందుకు పర్యావరణానికి భంగం కలిగించే జీవ వ్యతిరేక ప్రాజెక్టు వదులుకోవాలన్నారు. 2019లో కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వంలో శరావతి నీటిని బెంగళూరుకు తరలించాలనే కార్యాచరణపై నివేదికను తయారు చేసేందుకు సిద్ధమయ్యారు. శరావతి ప్రాంతానికి చెందిన శివమొగ్గ, ఉత్తర కన్నడ జిల్లాల్లో తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. నెలలకొద్దీ పోరాటాలు చేయడంతో ప్రభుత్వం అడుగు ముందుకేయలేదు.


శరావతి నది



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.13	1,627.54
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	31,033	706
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,201	10,207
సామర్థ్యం (టీఎంసీలు)	76.91	85.11

బియ్యం లారీ పట్టివేత

డ్రైవర్ బధిరుడు..?



రూరల్ పోలీసులు సీజ్ చేసిన లారీ

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 20: బళ్ళారి రూరల్ పోలీసులు ఈ నెల 19వ తేదీన కొళగల్లు వద్ద పేదల బియ్యాన్ని తీసుకెళుతున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. కాని ఈ కేసులో వివరాలు వెల్లడికాకుండా అధికారులు మసిబూసి మారేడుకాయచేస్తున్నారు. అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసైతే నమోదు చేశారుగాని, లారీలో ఎన్ని క్వింటాళ్ళ బియ్యం ఉన్నాయో పొందుపరచలేదు. కేసులో ఏ1గా లారీ యజమాని, ఏ2గా లారీ డ్రైవర్‌ను నమోదు చేశారు. కాని వారి పేర్లు ఎక్కడా తెలపకపోవడం గమనార్హం. ఈ విషయంపై జిల్లా ఆహార పౌరసరఫరా శాఖ అధికారి సకీనాను వివరాలు కోరగా, లారీ ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదని, లారీ డ్రైవర్ మూగ, చెవిటి అయినందున అతడి వద్ద నుండి వివరాలు రాబట్టలేక పోతున్నట్లు చెబుతున్నారు. మాటలు సరిగా రాని, చెవులు సరిగా వినబడని లారీ డ్రైవర్‌కు రవాణాశాఖ అధికారులు ఎలా లైసెన్సు మంజూరు చేశారనే విషయం ఆర్టీవో అధికారులు చెప్పాల్సివుంది. దీనిపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నారాయణ గురువు ఆశయాలను సాధిద్దాం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ నందీశ్

బళ్లారి సిటీ, ఆగస్టు 20: ఆడంబర జీవితంపై ఒత్తిడిలేకుండా సాదాసీదాగా జీవించేందుకు బ్రహ్మశ్రీ నారాయణ గురువుల ఆశయాలను, సిద్ధాంతాలను పాటిద్దామని మేయర్ ముల్లంగి నందీశ్ పేర్కొన్నారు. నగరంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో మంగళవారం కన్నడ సాంస్కృతిక శాఖ, మహనగర కార్పోరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్రహ్మశ్రీ నారాయణగురు జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్రహ్మశ్రీ నారాయణగురువులు అందరిలో సామరస్య భావాన్ని కలిగించారన్నారు. ముందరిగి నాగరాజు మాట్లాడుతూ.. అణగారిన దళితులు, దేవదాసీ వ్యవస్థ, సతీసహగమన వ్యవస్థతోపాటు అనేక సామాజిక దోపిడీలపై నారాయణగురు గళం విప్పారన్నారు. ఈసందర్భంగా బళ్లారి సత్యం కాలేజీ ప్రొఫెసర్ ఆలం భాషా, కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజు, జిల్లా ఆర్య ఈడిగ గౌణ మహాజన సభ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్, సంఘం నాయకులు, శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏళుపడగల నాగప్ప సేవలో అధికారులు



ప్రత్యేక పూజల్లో డీసీ ఎంఎస్ దివాకర్ దంపతులు

కంప్లి, ఆగస్టు 20: విజయనగర డీసీ ఎంఎస్ దివాకర్ శ్రావణ మంగళవారం సందర్భంగా బుక్కసాగర వద్ద వుండే ఏళుపడగల నాగప్ప ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితుడు విశ్వనాథ్ వారిచేత ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం జిల్లా అధికారి మాట్లాడుతూ ఈ శ్రావణ మాసం ప్రత్యేకమైన మాసమని, తమ ఆరాధ్యదైవాన్ని ప్రతి ఒక్కరు భక్తితో దర్శించుకుంటారన్నారు. తాము కూడా తన వంతుగా వచ్చే భక్తాదులకు సమస్యలు తలెత్తకుండా చూస్తామని తెలిపారు.

ఏపీఎంసీలో బురద కూరగాయలు

- బురదలోనే కొనుగోలు, అమ్మకాలు
- ఏపీఎంసీ అధికారుల నిర్లక్ష్యం
- సామర్థ్యానికి మించి లైసెన్స్‌ల మంజూరు
- అధికారులకు ఆదాయ వనరుగా అక్రమ స్టాల్స్



బురదమయమైన బళ్లారి ఏపీఎంసీ కూరగాయల మార్కెట్

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 20: బళ్ళారి జిల్లాతో పాటు చుట్టుప్రక్కల అనంతపురం, కర్నూలు జిల్లా రైతులకు మార్కెటింగ్ వేదికగా ఉన్న బళ్లారి ఏపిఎంసీ మార్కెట్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఈ కూరగాయల మార్కెట్ అంతా బురదమయంగా మారడంతో విధిలేక అక్కడే కూరగాయలు, ఆకుకూరలు అమ్మడం, కొనడం సర్వసాధారణంగా మారింది. మార్కెట్‌కు కూరగాయల కోసం వస్తే...అదనంగా రోగాలను కూడా ఇంటికి తీసుకెళ్లాల్సివస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంటుందనడానికి ఈ ఫోటోనే సాక్ష్యం. నిర్వహణలో భాగంగా ప్రతి రెండు రోజుల కొకమారు మార్కెట్ ఆవరణ అంతా శుభ్రం చేసి చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు తొలగించాల్సి ఉంటుంది. ఈ కాంట్రాక్టు పనులను ప్రతి యేటా టెండరు పిలిచి అర్హులకు అప్పగిస్తారు. మార్కెట్ నిర్వహణ కోసం నెలకు సుమారు రూ. 6లక్షల మేర బళ్ళారి ఏపిఎంసీ ఖర్చు చేస్తుంది. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరు నుంచి స్థానిక రాజకీయ నేతలు ఇతరులకు క్లీనింగ్ పనులు సబ్ కాంట్రాక్టుకు అప్పగించడంతో మార్కెట్ నిర్వహణ పూర్తిగా అధ్వాన్నంగా తయారైంది. పనులు పర్యవేక్షించాల్సిన సెక్రటరీ నంజుండస్వామి ఏ ఒక్కరోజు మార్కెట్ ప్రాంగణాన్ని పరిశీలించిన దాఖలాలు లేవు. ఏపీఎంసీ మార్కెట్‌లో అధికారింగా ఇప్పటివరకు కేవలం 29 మంది హోల్‌సేల్ కూరగాయల వ్యాపారుల కోసం గదులు కేటాయించారు. ప్రస్తుతం మార్కెట్‌లో అనధికారికంగా 250 మందికిపైగా లైసెన్స్‌లు మంజూరు చేయడం మార్కెట్ అపరిశుభ్రంగా మారడానికి మరో కారణమని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. పాలక మండలి ఏర్పడిన ప్రతిసారి మార్కెట్ ప్రాంగణంలో అక్రమస్టాల్స్ ఏర్పాటుకు అనుమతినిస్తూ జేబులు నింపుకుని వెళుతున్నారేగాని, మార్కెట్ అభివృద్ధిని పట్టించుకోవడంలేదని వ్యాపారస్తులు వాపోతున్నారు. బళ్ళారితో పాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రైతుల ఉత్పత్తుల అమ్మకాలకు వేదికగాఉన్న ఈ మార్కెట్‌లో వారికి అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదని వ్యాపారస్తులు వాపోతున్నారు. ఈ మధ్య కాలంలో నాబార్డ్ నిధులతో చేపట్టిన కవర్డ్ ప్లాట్‌పారమ్స్, డ్రైనేజీ కాలువల గురించి మార్కెట్ పాలకమండలి వారు గొప్పలు చెప్పుకుంటున్నారే గాని మార్కెట్‌కు సమకూరుతున్న కోట్లాది రూపాయలు ఎక్కడికి వెళుతున్నాయో వెల్లడించడంలేదు.

నీటి మడుగులో విద్యుత్ సబ్‌స్టేషన్

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 20: నగర విద్యుత్ సరఫరాలో ప్రధాన పాత్ర పోషిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నాయి. నగరంలోని మోకా గ్రామ శివారులో ఏర్పాటుచేసిన 110/కెవి సబ్‌స్టేషన్ నిర్వహణ సరిగా లేకపోవడంతో స్టేషన్‌లో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌పార్మర్ల చుట్టూ వర్షపునీరు నిలబడింది. సబ్‌స్టేషన్‌లో ఎక్కడా బయట నుంచి నీరు రాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన స్టేషన్ నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రమాద వశాత్తూ ఏదైనా జరిగితే భారీగా నష్టం జరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ట్రాన్‌ఫార్మల క్రింద కంకర, ఇతర ఇన్సులేటర్‌లు ఉపయోగించాల్సి ఉంది. ఇవేమి పట్టించుకోకుండా విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి యధేచ్ఛగా బయట నుండి నీరు రావడంతో ఆ ప్రాంతం వరిమడిని తలపిస్తోంది. సోమవారం మధ్యాహ్నం, రాత్రి నగరంలో భారీగా కురిసిన వర్షం కారణంగా రోడ్డుపై ఉండే వర్షపు నీరు ఏకంగా సబ్‌స్టేషన్‌లో చొరబడడంతో స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది ట్రాన్సఫార్మర్ల వద్దకు వెళ్ళాలంటేనే భయపడున్నారు. ఉన్నతాధికారులకు విషయం తెలిపినా వారు పట్టించుకోవడం లేదని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 132 రాష్ట్ర రహదారి ప్రక్కన ఏర్పాటు చేసిన సబ్ స్టేషన్ ముందు వర్షం నీటికోసం డ్రైనేజి ఏర్పాటు చేశారు. అయితే అదికాస్త పూర్తిగా పూడికతో మూసుకుని పోవడంతో వర్షం కురిసిన ప్రతి సారి దిగువ ప్రాంతంలోని సబ్‌స్టేషన్‌లోకి నేరుగా వర్షం నీరు చొరబడుతోంది. ప్రమాద మని తెలిసినా విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. సంబంధిత అధికారులు స్టేషన్ ముందు ఉన్న డ్రైనేజీని క్లీన్ చేయించి పొంచి ఉన్న ప్రమాదాన్ని అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



నీటి మడుగులో 110 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

పొంగుతున్న వాగులు.. వంకలు

కంప్లి, ఆగస్టు 20 : గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కంప్లి నియోజకవర్గం పరిధిలో నెంబర్ టెన్ ముద్దాపురం మీదుగా వెళ్లే నారెళ్ల వాగు ఉగ్రరూపం దాల్చింది. వాగు పక్కన వుండే ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. ముద్దాపురం పరిధిలోని ప్రభు క్యాంపులో ఇళ్లలోకి నీరు చేరుకుని గ్రామస్తులు ఇబ్బందులకు గురయ్యారు. సన్నాపురం వద్ద ఇందిరానగర్‌లో ఇళ్లల్లోకి నీరు చేరుకోవడంతో ఎమ్మెల్యే గణేష్ అక్కడకు చేరుకుని పరిశీలించి బాధితులకు సహాయం చేస్తానని హామీఇచ్చారు.

భారీ వర్షంతో ఉప్పొంగిన వాగులు వంకలు

సిరుగుప్ప: సిరుగుప్ప తాలుకాలో మంగళవారం తెల్లవారుజామున భారీ వర్షం కురవడంతో హగరి నది పొంగిప్రవహిస్తోంది. దిగువ ప్రాంతాలలో వర్షపు నీరు జలపాతంలా మారింది.

గ్రామీణ ప్రాంతాల్లో నీటమునిగిన పంటలు

బళ్లారిరూరల్ : తాలుకాలోని హగరి, మోకా, రూపనగుడి, రాయాపురంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం రాత్రి నుండి మంగళవారం ఉదయం వరకు భారీ వర్షం కురవడంతో పంట పొలాలు నీటిలో మునిగాయి. రైతులు తీవ్రంగా ఇబ్బందులకు గురయ్యారు. అండర్ బ్రిడ్జి సమీపంలో నివాసాలలోకి నీరు చేరడంతో గృహిణులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని హాలర్వి, చింతకుంట, కర్నూలు, బళ్లారి వెళ్లే రహదారిలో వర్షానికి వంకలు, వాగులు భారీగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. ఆయా గ్రామాల ప్రజలు బళ్లారి చేరుకునేందుకు దాదాపు 30 నుంచి 40 కిలోమీటర్ల మేర చుట్టు తిరిగి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.



ప్రభుక్యాంపులో ఇంటిలోకి నీరు చేరడంతో ఇబ్బందులు



మెట్రి వద్ద ధ్వంసమైన రోడ్డు



చెరువులా మారిన బళ్లారి పాత తాలుకా ఆఫీస్



నిండుగా ప్రవహిస్తున్న హగరి నది

నేటి నుంచి తెలుగు సాహితీ విందు

ఆహూతులను అలరించనున్న యుగళ మహాశతావధానం



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథ, రాజేశ్వరి తదితరులు

బళ్లారి సిటీ,ఆగస్టు 20:నగరంలోని బాలాంజనేయ స్వామి మఠంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు తెలుగువారికి సాహితీ విందు జరగనుంది. సహస్రావధాని వద్దివర్తి పద్మాకర్, ఉప్పలదడియం భరత్‌శర్మలు తమ యుగళ మహాశతావధానంతో తెలుగువారిని అలరించనున్నారు. బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయంత్రం 4 నుంచి 7గంటల వరకు శతావధానం నిర్వహించనున్నట్లు హరిహరపురం లక్ష్మీనరసింహ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామివారి కార్యదర్శి రఘునాథ శాస్త్రి తెలిపారు. నగరంలోని కెయస్‌ఆర్టీసీ ఎదురుగాగల బాలాంజనేయస్వామి మఠంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 17వ తేది నుంచి సచ్చిదానంద సరస్వతి శ్రీ చతుర్మాస్య వ్రతాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా సహస్రావధాని వద్దివర్తి పద్మాకర్, ఉప్పలదడియం భరత్‌శర్మలు యుగళమహాశతావధానం నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ యంవియస్ సత్యనారాయణ సంచాలకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహవారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారన్నారు. గురుభక్తులు రాజేశ్వరి మాట్లాడుతూ.. శతావధానాన్ని ఆస్వాదించడానికి ఇతర ప్రాంతాలనుండి భారీసంఖ్యలో బాషాభిమానులు తరలివస్తున్నట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో వెంకటరమణ, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆశాజ్యోతి దేవరాజు అరసు: డీసీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి, సిటీ, ఆగస్టు 20: సమాజంలోని అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం జరగాలని కోరుకున్న దేవరాజు అరసు రైతుల పాలిట ఆశాజ్యోతి అని డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అన్నారు. నగరంలోని నల్లచెరువు జిల్లాస్టేడియం వాల్మీకి భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన దేవరాజు అరసు 109వ జయంతి వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయన హయాంలోనే వెనుకబడిన తరగతుల విద్యార్థుల అభివృద్ధి కోసం రాష్ట్రంలో హాస్టళ్లను నెలకొల్పారని, విద్యార్థులు ఈ హాస్టళ్లను సద్వినియోగం చేసుకొని విలువైన జీవితాలను నిర్మించుకోవాలన్నారు. ఈసందర్భంలో లెదర్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ ముందరగి నాగరాజు మాట్లాడుతూ, కర్ణాటకలో కనిపించే అరుదైన రాజ కీయ నాయకుడు దేవరాజు అరసు అని, సామాజిక న్యాయం గురించి ఆయనకు లోతైన అవగాహన ఉందన్నారు. అందుకే ఆయన సామాజిక న్యాయానికి ఆద్యుడిగా పేరొందాన్నారు. తదనంతరం కొట్టూరు స్వామిస్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ సురేశ్‌బాబు మాట్లాడుతూ, పేదలందరికీ ఇళ్ళ సౌకర్యాలు, విద్యలో సమానత్వం కల్పించి సామాజిక కార్యకర్తగా పనిచేశారన్నారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన దేవరాజు అరసు కర్ణాటక ప్రజల గుండెల్లో కొలువైఉన్నారన్నారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించి న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ ముల్లంగి నందీశ్, హామిపథకాల అధ్యక్షుడు చిదానందప్ప, అదనపు పోలీస్ అధికారి నవీన్‌కుమార్, జిల్లాకు చెందిన ప్రతినిధులు, వెనుకబడిన తరగతుల వివిధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అరసును ఆదర్శంగా తీసుకోవాలి



కంప్లిలో దేవరాజ అరసు, నారాయణ జయంతి వేడుకల్లో ప్రముఖులు

కంప్లి: విద్యార్థులు.. దేవరాజు అరసును ఆదర్శంగా తీసుకుని నిత్య జీవితంలో ఎదగాలని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. దేవరాజు అరసు, బ్రహ్మశ్రీ నారాయణ జయంతి వేడుకలు కంప్లి తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. వారి భావ చిత్రపటానికి పూలమాలలతో పూజలు చేపట్టారు. ఆయనతోపాటు బీసీఎం హాస్టల్ అధికారి మల్లికార్జున, డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర, నరసప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం అరసు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజ

సిరుగుప్ప: వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం దేవరాజ అరసు ఎంతగానో కృషి చేశారని ఎమ్మెల్యే బీఎం నాగరాజు తెలిపారు. మంగళవారం పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో తాలుకా పరిపాలనా, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దేవరాజ అరసు జయంతి వేడుకలు జరిగాయి. ఆయన అడుగు జాడల్లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య నిరుపేదలకు గ్యారెంటీ పథకాల ద్వారా సౌలభ్యాలను కల్పిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ గాదెలింగప్ప, కాంగ్రెస్ నాయకులు కరిబసప్ప, గణేష్, పవన్‌కుమార్ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

హోసూరు జోన్

సమీకృత ఎరువుల నిర్వహణపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న రైతులు

హోసూరు(సిఫ్‌కాట్) ఆగస్టు 20: హోసూరు సమీపంలోని గూళిసంద్రం గ్రామంలో సమీకృత ఎరువుల నిర్వహణపై 40 మంది రైతులకు మంగళవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, భువనగిరి సాగులో మెళకువలు, అంతర పంటలు వల్ల కలిగే ప్రయోజనాలు, మట్టి నమూనా సేకరణ ప్రాముఖ్యత, మట్టి నమూనా సేకరణ పద్ధతులు, వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న సబ్సీడీ పథకాల గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ అధికారిణి, హోసూరు రేణుక సేంద్రియ వ్యవసాయంలో కృత్రిమ ఎరువులకు బదులు సహజ ఎరువులు వేసి దిగుబడిని పెంచే సాంకేతిక పద్ధతుల గురించి తెలిపారు. పంచగవ్య, జీవామృతం తయారీ గురించి, 2 శాతం డీఏపీ ద్రావణాన్ని నేలపై పిచికారీ చేయడం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు అదియమాన్ కళాశాల ఆఫ్ అగ్రికల్చర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, రాసాకుమార్ భూసారాన్ని మెరుగుపరచడానికి సూక్ష్మ పోషక ఎరువుల గురించి తెలిపారు. బయోఫెర్టిలైజర్‌లను ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి, నాణ్యమైన విత్తనాల గురించి వివరించారు. మట్టిలో టేప్‌వార్మ్‌లను నియంత్రించడానికి సూడోమోనాస్ ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలిపారు.

ఘనంగా రాజీవ్, అరసుల జయంతి

రాయచూరు, ఆగస్టు 20: మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ 80వ జయంతి, మాజీ ముఖ్యమంత్రి దివంగత దేవరాజ్ అరసు 109వ జయంతిని రాయచూరు నగరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. డీసీసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖ మంత్రి ఎన్‌ఎస్. భోసరాజు, రాయచూరు ఎంపీ జీ కుమార్ నాయక్, ఇతర కాంగ్రెస్ నేతలు దివంగత నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన మంత్రి ఎన్‌ఎస్. భోసరాజు, శాస్త్ర సాంకేతిక రంగాల పురోభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన కృషిని కొనియాడారు.

హోసూరులో టైకో బ్యాంకు కార్యకలాపాల ప్రారంభం

హోసూరు ఆగస్టు 20 : పరిశ్రమల కమిషనర్ నియంత్రణలో పనిచేస్తున్న టైకో బ్యాంకు అని పిలువబడే తమిళనాడు ఇండస్ట్రీయల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ హోసూరు బస్ స్టేషన్ ఎదురుగా తమ శాఖ కార్యక్రమాలను ప్రారంభించింది. కొత్త శాఖ కార్యక్రమాలను సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి థామో అన్బరసన్ వీడియో ప్రదర్శన ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూక్ష్మ చిన్న మధ్య తరహ పరిశ్రమల శాఖ కార్యదర్శి శ్రీమతి అర్చన పట్నాయక్, ఈఏపీ పరిశ్రమల కమీషనర్ వాణిజ్య శాఖ అదనపు కమీషనర్ కే.శివసౌందరవల్లి, సీఈఓ, టైకో బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ రవిచంద్రన్, మేనేజింగ్ ఆఫీసర్ ఎం. తిరుమల్ రాజేంద్రన్, హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



మైక్రో స్మాల్ స్కేల్ సంస్థకు ఆర్థికసహాయం అందజేస్తున్న దృశ్యం

శాస్త్రీయ విజ్ఞానంతోనే సమాజ పురోగతి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, ఎంపీలు

రాయచూరు, ఆగస్టు 20: శాస్త్ర, సాంకేతిక రంగాలపై శాస్త్రీయ అవగాహన ఉన్నప్పుడే సమాజం అన్ని విధాల పురోగతి సాధిస్తుందని రాష్ట్ర చిన్న నీటి పారుదల శాఖ మంత్రి ఎన్‌ఎస్. భోసరాజు అన్నారు. ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. మంగళవారం నగరంలోని జిల్లా విజ్ఞాన కేంద్రంలో జాతీయ వైజ్ఞానిక మనోభావ దినాచరణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన విద్యార్థుల్లో వైజ్ఞానిక అవగాహన పెంచడమే లక్ష్యంగా టెలిస్కోప్‌లను అందజేస్తున్నట్లు వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు విద్యార్థుల్లో శాస్త్రీయ మనోభావాలను పెంచేందుకు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో పాల్గొన్న రాయచూరు ఎంపీ జీ కుమార్ నాయక్ విద్యార్థులను విజ్ఞాన శాస్త్రంవైపు ఆకర్షించేలా ప్రయోగాత్మక బోధన సాగాలన్నారు. అదే సమయంలో విద్యార్థుల్లో అవగాహన పెంచుకునే సామర్థ్యాన్ని పెంచడం, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చడం పరిశోధనలవైపు వారిని మళ్లించడంపై బోధకులు దృష్టి సారించాలన్నారు.

రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో రాఘవేంద్రస్వామి బృందావనం

కంప్లి, ఆగస్టు 20 : రాఘవేంద్రస్వామి వారి ఆరాధనోత్సవాలు సోమ,మంగళవారాల్లో కంప్లిపట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి బృందావనానికి ప్రత్యేకాలంకరణ చేపట్టారు. గత రెండు మూడు రోజులుగా ఆలయంలో వివిధ ధార్మిక పూజలు జరిగాయని ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు. కంప్లి పట్టణంతో పాటు వివిధ గ్రామాలు, క్యాంపులలో రాఘవేంద్రస్వామి భక్తులు పూజల్లో పాల్గొని స్వామివారికి మొక్కులు సమర్పించుకున్నారు. పూజల్లో పాల్గొన్న వారికి కమిటీవారు అన్నప్రసాదాలు ఏర్పాటుచేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ (వర్ధంతి)



షెహనాయ్ సంగీతవాద్య ఆలాపనలో జాతీయస్థాయిలో రాణించిన 'భారతరత్న' పురస్కార గ్రహీత 'ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ 1916 మార్చి 21న బీహారు రాష్ట్రం డుమ్రాన్ జిల్లా బిరుంగ్‌రౌట్‌కి గల్లిలో జన్మించారు. ప్రత్యేకించి దేశవాళీ ఓబో (ఒక రకమైన సన్నాయి వాద్యం)పై సత్తా చాటారు. సంప్రదాయ కార్య క్రమాలకే పరిమితమైన షెహనాయ్‌కు జాతీయ గుర్తింపు తెచ్చిన ఘనత ఆయనదే. 1947 ఆగస్టు 15న ఎర్ర కోటపై సన్నాయి వాయించేందుకు అప్పటి ప్రధాని జవ హర్‌లాల్ నెహ్రూచే ఆహ్వానించబడ్డారు. 2001లో అత్యున్నత 'భారతరత్న' పురస్కారం అందుకున్నారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, సంగీత నాటక అకాడమీ అవార్డు, తాన్‌సేన్ అవార్డు అందుకున్నారు. 2006 ఆగస్టు 21న కన్నుమూశారు. పాత వారణాసి ప్రాంతంలో అంత్యక్రియలకు ఆర్మీ తరఫున గన్ సెల్యూట్‌తో నివాళులు అర్పించారు.

లక్ష్మాగౌడ్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత, ప్రముఖ చిత్రకారుడు కలాల్ లక్ష్మాగౌడ్ 1940 ఆగస్టు 21న మెదక్ జిల్లా నిజాంపూర్‌లో జన్మించారు. చిత్ర కళ, ముద్రణలోనే కాక డ్రాఫ్టింగ్ లోనూ ప్రతిభ చాటుకున్నారు. బరోడాలోని మహారాజ్ సయ్యాజీరావ్ యూనివర్శిటీ నుంచి 'ఫ్యాకల్టీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్'లో పట్టా పొందారు. శిల్పకళ, గాజులపై చిత్రకళలో ఆరితేరారు. ప్రత్యేకించి గ్రామీణ నేపథ్యం గల శృంగారభరిత చిత్రాలలో పేరొందారు. మ్యూరల్ పెయింటింగ్‌లో రాణించారు. హైదరాబాద్ యూనివర్శిటీలో స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్, ఫైన్ ఆర్ట్ అండ్ కమ్యూనికేషన్స్‌లో పాఠాలు బోధించారు. 2016లో 'పద్మశ్రీ' పురస్కారం పొందారు. ఆయన చిత్రాలు పలు జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనల్లో చోటు చేసుకున్నాయి.

ఉసేన్ బోల్ట్ (పుట్టినరోజు)



'స్ప్రింటర్ (తక్కువ దూరాన్ని ఎక్కువవేగంతో పరుగెత్తడం)గా వరల్డ్ రికార్డు నెలకొల్పిన ఉసేన్ బోల్ట్ 1986 ఆగస్టు 21న జమైకా దేశంలో జన్మించారు. పూర్తి పేరు ఉసేన్ సెయింట్ లియో బోల్ట్. 100 మీటర్లు, 200 మీటర్లు, 4/100 మీటర్ల రిలేలో ప్రపంచరికార్డులు సృష్టించారు. 8సార్లు ఒలింపిక్ బంగారు పతకం సాధించారు. 2008, 2012, 2016లలో ఒలింపిక్స్ పోటీల్లో 100, 200 మీటర్లలో వరుసగా మూడుసార్లు పతకం గెలుపొందిన ఏకైక వ్యక్తి. ఐఏఏఎఫ్ వరల్డ్ అథ్లెట్ ఆఫ్ ది ఇయర్, బీ బీసీ ఓవర్సీస్ స్పోర్ట్స్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ (మూడు సార్లు) తదితర పురస్కారాలు అందుకున్నారు. 2017 వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీల తర్వాత రిటైర్మెంట్ ప్రకటించారు. 19 గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించిన ఘనత ఆయనది.

వైభవం.. వెండిరథ ప్రాకారోత్సవం



వెండిరథంలో ఊరేగుతున్న శ్రీవారు

కదిరి: పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వసంత వల్లభుల స్వామివారికి వెండిరథ ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహించారు. వెండిరథంపై కొలువుదీరిన స్వామివారిని సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రకారోత్సవం వైభంగా నిర్వహించారు.

కాలుష్య కాటు..!

నీటి కలుషితంతో ప్రబలిన అతిసార

మంచంపట్టిన కొంకల్లు, ఎం.రాయాపురం

మడకశిర/గుడిబండ/రొళ్ల, ఆగస్టు 20: నీటి కాలుష్యం కాటేసింది. అతిసారం ప్రబలింది. గుడిబండ మండలంలోని కొంకల్లు, రొళ్ల మండలంలోని ఎస్ రాయాపురం గ్రామాలు మంచం పట్టాయి. ఆయా ఊళ్లలో పదుల సం ఖ్యలో జనం అతిసారం బారినపడి విలవిల్లాడుతున్నారు. గత కొన్ని రోజుల వ్యవధిలోనే కొంకల్లులో ఏడుగురు మరణించడంతో అందరూ హడలిపోతున్నారు. ఇంకా పదుల సంఖ్యలో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దీంతో గ్రామం బోసిపోయింది. జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. 'కొంకల్లులో మరణ మృదంగం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రచురించిన కథనంతో అధికారులు గ్రామానికి పరుగులు పెట్టారు. వైద్యాధికారులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, చికిత్సలు చేశారు. పలు శాఖల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామస్థులకు ట్యాంకర్ల ద్వారా శుద్ధి నీటిని సరఫరా చేశారు.

40 మందిదాకా బాధితులు

కొంకల్లు గ్రామంలో అతిసార కోరలు చాచడంతో గ్రామస్థులు అల్లాడిపోతున్నారు. 10 రోజులుగా వరుస మరణాలతో వణికిపోతున్నారు. 40 మందిదాకా అతిసార బారినపడ్డారు. కొంతమంది కర్ణాటక, తుమకూరు, చిక్కబల్లాపురు, మడకశిర తదిర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లారు. కొంతమంది కోలుకున్నారు. మరికొంత మంది ఆస్పత్రుల్లోనే ఉన్నారు. కలుషిత నీరు తాగడం వల్లే వాంతులు, విరేచనాల బారిన పడ్డామని గ్రామస్థులు వాపోతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగు ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఎం.రాయాపురం గ్రామంలో పలువురు వాంతులు, విరేచనాలతో విలవిల్లాడుతున్నారు. సోమవారం రాత్రి 12 మందికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. మంగళవారం ఉదయం మరో 9 మందికి అయ్యాయి. దీంతో మంగళవారం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి, చికిత్స అందించారు.

వైద్యశిబిరాలు ఏర్పాటు చేశాం

కొంకల్లు, ఎస్ రాయాపురం గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, చికిత్సలు అందిస్తున్నాం. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం.


- మంజువాణి, జిల్లా వైద్యాధికారి

గవర్నర్‌పై కాంగ్రెస్ వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ

బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ముడా ఇంటి స్థలాల వివాదంలో ముఖ్యమంత్రిని ప్రాసిక్యూషన్ చేసేలా అనుమతులు ఇచ్చిన మేరకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌పై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. సోమవారం నిరసనల వేళ గవర్నర్‌ను ఉద్దేశించి కఠినమైన వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ రూపంలో బొమ్మలాటలు, బీజేపీ కార్యకర్త, రాజ్‌భవన్ కాదది బీజేపీ కార్యాలయం అంటూ నినాదాలు చేశారు. గవర్నర్‌కు బంగ్లాదేశ్‌లో జరిగిన పరిస్థితి ఎదురవుతుందని ఎమ్మెల్సీ ఐవాన్ డిసౌజా వ్యాఖ్యానించారు. రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ మాట్లాడుతూ గవర్నర్ పదవికి అనర్హుడని, బీజేపీ ఏజెంట్ అంటూ వ్యాఖ్యానించారు. గవర్నర్ దిష్టిబొమ్మ దహనం, ఆయన చిత్రానికి పాదరక్షలతో కొట్టడం ద్వారా ఆక్రోశం చూపారు. గవర్నర్ పట్ల మంత్రులు, కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను తిప్పికొట్టేందుకు బీజేపీ దళిత అస్త్రం ప్రయోగించేందుకు సిద్ధమయ్యారు. గవర్నర్ పట్ల కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరును తిప్పికొట్టాలని కీలక నేతలు సమావేశం జరిపారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి, రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి సునిల్‌కుమార్‌లు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గవర్నర్ గెహ్లోట్ దళిత సామాజికవర్గానికి చెందినవారని, గతంలో కేంద్ర కేబినెట్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమాభివృద్ధిశాఖ మంత్రిగా వ్యవహరించారని, కిందిస్థాయి నుంచి గవర్నర్ హోదా దాకా ఎదిగారని అభిప్రాయపడ్డారు. నిత్యం రాజ్యాంగం గురించి మాట్లాడే కాంగ్రెస్ నేతలు అత్యున్నతమైన గవర్నర్ పదవికి భంగం కలిగించేలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. ఇదే విషయమై ఆందోళనలు చేయాలని తీర్మానించారు. చిత్రదుర్గ ఎంపీ గోవిందకారజోళ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ గవర్నర్ పట్ల అనుచితంగా వ్యవహరించిన ఎమ్మెల్సీ ఐవాన్ డిసౌజా, మంత్రులు కృష్ణబైరేగౌడ, జమీర్ అహ్మద్, దినేశ్ గుండూరావులపై సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామితో కలసి మీడియాతో మాట్లాడారు. గవర్నర్ హోదా రాజ్యాంగబద్ధమైనదన్నారు. థావర్‌చంద్ గెహ్లోట్‌పట్ల ఏకవచనంతో మాట్లాడడం సరికాదన్నారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా తరహాలో తరుముతామని ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం రాజ్యాంగం అంటూ నీతులు చెప్పే కాంగ్రెస్ నేతలు, బంగ్లాదేశ్ తరహాలో తరిమి కొడతామనడం దేశద్రోహం కాదా... అని ప్రశ్నించారు. గతంలో గవర్నర్ హంసరాజ్ భరద్వాజ్ అప్పటి సీఎం యడియూరప్పపై ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చారని తాము ఆందోళనలు చేశామని అయితే ఇలాంటి నీచమైన పదాలు వాడలేదన్నారు. ఇలా మొత్తమ్మీద కాంగ్రెస్ వ్యాఖ్యలను బీజేపీ ఖండించి తిప్పికొట్టింది.

కన్నడిగులకే కన్నడ భాష నేర్పించాల్సిన దుస్థితి విచారకరం

▸▸ సాహితీ పరిశోధకుడు హంప నాగరాజయ్య



హంప నాగరాజయ్య

బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కన్నడిగులకే కన్నడ భాష నేర్పించాల్సిన దుస్థితిలో ఉన్నామని ప్రముఖ సాహితీవేత్త హంప నాగరాజయ్య విచారం వ్యక్తం చేశారు. కన్నడ అభివృద్ధి ప్రాధికార ఆధ్వర్యంలో కన్నడేతరులకు భాష నేర్పించే ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హంప నాగరాజయ్య మాట్లాడుతూ సామాన్యంగా కన్నడిగులు మాట్లాడడం చూస్తే వారి భాషలో ఎక్కువ ఇంగ్లిష్‌పదాలే ఉంటున్నాయన్నారు. వారు కంగ్లిష్ మాట్లాడుతున్నట్టుగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. అటువంటి పరిస్థితి దాపురించిందన్నారు. కన్నడిగులకే కన్నడ నేర్పించాల్సిన అనివార్యంలో ఉన్నామన్నారు. కన్నడ అభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు పురుషోత్తమ బిళిమలె మాట్లాడుతూ సరోజిని మహిషి నివేదిక అమలు చేయడం అసాధ్యమని, సుప్రీంకోర్టు కూడా అంగీకరించదన్నారు. దేశంలోని ఏ రాష్ట్రానికి చెందినవారైనా రాష్ట్రంలో ఉద్యోగాలు చేయవచ్చునని సుప్రీం కోర్టు సూచించిందన్నారు. ఇదే విధానం కొనసాగితే కన్నడ అస్తిత్వం ఏం కావాలన్నారు. సమాఖ్య వ్యవస్థలో అన్ని భాషలు, రాష్ట్రాలలో అన్ని అస్థిత్వాన్ని కాపాడుకుంటున్నాయని కానీ కన్నడలో వీలు కావడం లేదన్నారు. హోం మంత్రిత్వశాఖలో హిందీ అభివృద్ధి సంస్థ ఉందని, హిందీ అభివృద్ధికోసం ఏం చేయాలనేది సమితి నిర్ణయిస్తుందన్నారు. హిందీ భాష మాట్లాడేవారు 66శాతానికి చేరగా కన్నడ ప్రగతి 3శాతమే అన్నారు. కన్నడలో చదివే పిల్లలకోసం కన్నడ సంస్కృతి, చరిత్ర, భాష ప్రాధాన్యత వంటి అంశాలపై సరళమైన భాషలో వంద లఘు పుస్తకాలను ప్రచురించే ఆలోచన ఉందన్నారు.

అరుదైన రాజకీయనేత అరసు

బాగేపల్లి, ఆగస్టు 20: సమాజంలో వెనుకబడిన వర్గాల సంక్షేమానికి పాటుపడిన అరుదైన రాజకీయ నేత దేవరాజ్ అరసు అని బీఈఓ ఎన్ వెంకటేశ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని తాలూకా దేవరాజ్ అరసు సభాంగణంలో తాలూకా జాతీయపండుగల ఆచరణ సమితి, పంచాయతీ, జిల్లా పంచాయతీ, పురసభ తాలూకా యంత్రాంగం, వెనుకబడినవర్గాల సంక్షేమ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం దేవరాజ్ అరసు 109వ జయంతి, ఆర్య ఈడిగ సామాజికవర్గం ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ నారాయణ గురు జయంతి నిర్వహించారు. అరసు, నారాయణగురు చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి బీఈఓ మాట్లాడారు. పేదలు, అవకాశ వంచితుల పట్ల సంక్షేమం దృష్టి సారించిన దేవరాజ్ అరసు రాజకీయంగా, సామాజికంగా వారి ఉన్నతికి శ్రమించారన్నారు. దున్నేవాడిది భూమి చట్టం ఆయన పాలనలో చారిత్రక సాధనగా నిలిచిందన్నారు. సహాయక ప్రాధ్యాపకులు గుడిబండ కెఎం నయాజ్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ వర్గాలు, రైతుల సమస్యల ధ్వనిగా, సామాజిక, ఆర్థిక, విద్యాప్రగతికి బాటలు వేసిన మహా వ్యక్తిగా దేవరాజ్ అరసు నిలిచారన్నారు. గ్రామాలలో సైతం విద్యార్థులకోసం హాస్టళ్ల నిర్మాణం ద్వారా వారి విద్యాప్రగతికి పాటుపడ్డారన్నారు. రిజర్వేషన్‌ల ప్రకారం వెనుకబడినవర్గాల ఉన్నతికి ఎంతో కృషి చేశారన్నారు. శతాబ్దాలపాటు గుర్తుంచుకునేలా కార్యక్రమాలు రూపొందించి సదా చిరస్మరణీయులుగా నిలిచారన్నారు. ఇదే సందర్భంగా ఎస్ఎస్ఎల్‌సీ, ద్వితీయ పీయూసీలో అత్యధిక మార్కులు పొందిన బీసీ హాస్టళ్ల విద్యార్థులను అభినందించారు. వివిధ పోటీల విజేతలకు పురస్కారాలు, వివిధ పథకాల సంక్షేమాలు అందచేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆర్ శివప్ప, తాలూకా వెనుకబడినవర్గాల శాఖ అధికారులు, పురసభ ముఖ్యాధికారి శ్రీనివాస్, కృష్ణారెడ్డి, జయ ప్రకాశ్ నారాయణ్, పురసభ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, గడ్డం రమేశ్, శివప్ప తదితరులు పాల్గొన్నారు.



వివిధ పోటీల విజేతలకు సన్మానం

డిసెంబరులో స్టోగో ఫెస్ట్



పోటీల వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్టోగో ఫెస్ట్, చైల్డ్ ఆన్‌లైన్ ప్రొటెక్షన్ పురస్కారాల పోటీలు డిసెంబరు 9వ తేదీ నుంచి రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఆర్ ఆర్ గ్రూప్ సంస్థల క్యాంపస్‌లో జరిగే కార్యక్రమంలో స్టోగో ఫెస్ట్ వ్యవస్థాపకుడు జయేశ్ సెబాస్టియన్, లింగ ఆర్, కర్ణాటక సమన్వయ కర్త ఎస్‌కే షఫీలు పాల్గొననున్నారు. ఎస్‌కే షఫీతోపాటు ప్రతినిధులు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో మీడియాతో మాట్లాడారు. స్టోగో ఫెస్ట్ అనేది అంతర్జాతీయ స్థాయిలో స్టీమ్ పోటీగా ఉంటుందన్నారు. గ్రేడ్4 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొనవచ్చునన్నారు. పిల్లల డిజిటల్ యోగక్షేమాల కోసం ఏఐ, రోబోటిక్స్ వినియోగం అనే అంశంతో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందేవారికి 2025 ఫిబ్రవరి 6 నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. సారాబాయ్ ఇన్‌స్టిట్యూట్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రాంతీయ సదస్సు జరిగిందన్నారు. ఇక్కడ పదాలకంటే విద్యాసంస్థల సాధనలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇంటర్నెట్, డిజిటల్ సాధనలను బాధ్యతాయుతంగా పరిణామకారి కోసం ఉపయోగించేలా పిల్లల్లో విజ్ఞానాన్ని పెంపొందింపచేయాలనేది ఆశయమన్నారు.

స్లైస్‌తో విలీనానికి ఎన్‌సీఎల్‌టీ ఆమోదం

బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు స్లైస్, నార్త్ ఈస్ట్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదం తెలిపింది. బెంగళూరు కేంద్రం గా స్లైస్ సంస్థ పని చేస్తోంది. ఈమేరకు వ్యాపార విస్తరణ కోసం నార్త్ ఈస్ట్ స్మాల్ ఫైనాన్స్‌బ్యాంకులోకి విలీ నమైనట్టు నగరంలో సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు. విలీన ప్రక్రియతో మరింత పురోగతి సాధ్యమనే ఆశాభావం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి పోటీలకు జానపద బృందం

శిడ్లఘట్ట, ఆగస్టు 20: రాష్ట్రస్థాయి ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీలు 2024-25 వార్షిక పోటీలు బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో ఉత్సాహంగా జరిగాయి. సాంస్కృతిక విభాగం పోటీల్లో జానపద నృత్యంలో చిక్కబళ్లాపుర జిల్లా శిడ్లఘట్ట తాలూకా ఉపాధ్యాయినుల సక్సెస్ బృందం ప్రథమస్థానంలో నిలిచి రెండోసారి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బృందంలో విద్యాశాఖ శైలజా, సరిత, చైత్ర, ఉషా, చూడామణి, సౌమ్య, శివలీలా, కృష్ణప్ప, నారాయణస్వామి, మంజునాథ లు పురస్కారాలకు ఎంపికైనవారు. ఎంపికైన విజేత జట్టును శిడ్లఘట్ట పట్టణ, గ్రామీణ ప్రాంతవాసులు ప్రశంసించారు.



పింపికైన బృందం వీరే...

కార్గిల్ స్మారకంలో సైనికులతో రక్షాబంధన్

బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రక్షాబంధన్‌ను సైనికులతో కలసి జరుపుకోవడం సంతోషంగా ఉందని బృందావన గ్రూపు సంస్థల సీఈఓ డాక్టర్ శృతి శర్మ అభిప్రాయపడ్డారు. సోమవారం కార్గిల్ యుద్ధ ప్రాంతాన్ని సందర్శించి అమరవీరుల స్మారకాలను సందర్శించడం గర్వకారణం అనిపించిందన్నారు. ఈమేరకు నగరంలో శృతిశర్మ పేరిట ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్మీగుడ్‌విల్ స్కూల్‌ను సందర్శించానని అక్కడి విద్యార్థులతో చర్చాగోష్టిలో పాల్గొన్నానన్నారు. సైనికుల పిల్లల విద్యకోసం అవసరమైన సౌలభ్యాలను తమవంతు సమకూరుస్తామని హామీ ఇచ్చామన్నారు. కాశ్మీరీ యువతకు గుణాత్మకమైన విద్య కల్పించడం ముఖ్యమని భావిస్తున్నా అన్నారు. దేశభద్రతను కాపాడుతున్న సైనికులకు రాఖీ కట్టడం కొత్త అనుభూతి ఇచ్చిందన్నారు.



కార్గిల్‌లో సైనికులతో డాక్టర్ శృతిశర్మ

ఎక్స్‌పోలో రాణించిన విశ్వవిద్యాలయాలు

బెంగళూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ విద్య, పోటీపరీక్షలు నిర్వహించే సంస్థలు బెంగళూరులో నిర్వహించిన స్టడీ అబ్రాడ్ ఎక్స్‌పోలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు రాణించినట్టు వరల్డ్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ డిజిటల్ మార్కెట్ ముఖ్యులు అభినవ్ జనా తెలిపారు. ఇటీవల రెండురోజులపాటు నిర్వహించిన ఎక్స్‌పో వివరాలను నగరంలో మంగళవారం మీడియాకు తెలిపారు. అరోజినా స్టేట్ యూనివర్సిటీ, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, కువెన్‌ట్రీ కనెక్టికట్‌తోపాటు 30కుపైగా విద్యాసంస్థలు భాగస్వామ్యం అయ్యాయన్నారు. విదేశాలలో ఉన్నత విద్య పట్ల ఏటా ఆసక్తి చూపేవారి సంఖ్య పెరుగుతోందన్నారు. ఎంబీఏతోపాటు పలు వృత్తి విద్యాకోర్సులకోసం అంతర్జాతీయ యూనివర్సిటీలను ఎంపిక చేసుకుంటున్నారన్నారు. విదేశాలలో చదువుకునేవారికి రుణసదుపాయాలు సరళీకృతంగా సాధ్యమవుతోందన్నారు.

సాంకేతిక విద్యలో పరిశోధనలు పెరగాలి



స్నాతకోత్సవంలో ప్రముఖులు

బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యలో పరిశోధనలు పెరగాలని ఎన్‌బీఏ, ఎన్ఏఏసీ చైర్మన్ ప్రొఫెసర్ అనిల్‌సహస్రబుదె అభిప్రాయపడ్డారు. నగరంలో మంగళవారం ఏర్పాటైన ఆర్‌వీ యూనివర్సిటీ రెండో స్నాతకోత్సవానికి కులపతి డాక్టర్ ఏవీఎస్ మూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యులుగా పాల్గొన్న అనిల్‌సహస్రబుదె మాట్లాడుతూ విద్యావిధానంలో కీలకమైన మార్పు తీసుకొచ్చేలా జాతీయ విద్యావిధానం దోహదపడుతుందన్నారు. గుణాత్మకమైన విద్య అందించడం ద్వారా వృత్తిపరమైన నైపుణ్యత విద్యార్థులలో పెరుగుతుందన్నారు. తద్వారా విశ్వంతోపోటీపడే మానవవనరుల రూపకల్పన సాధ్యమవుతుందన్నారు. సమగ్ర విద్య, ఆధునాతన పరిశోధనలవైపు యువ విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. 2047 నాటికి భారత్ అతిపెద్ద ఆర్థికత చేకూరేందుకు అందరం భాగస్వామ్యం కావాలన్నారు. కృత్రిమ మేధస్సు, క్వాంటమ్ కంప్యూటింగ్, రోబోటిక్స్ రంగాలకు సంబంధించి చర్చాగోష్టి జరిగింది. 124మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఉపకులపతి డాక్టర్ వైఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ మూడేళ్ల ఉత్తమ ప్రగతి సాధించామన్నారు. 3 పాఠశాలలనుంచి 9 పాఠశాలలకు, 150 మంది నుంచి 4వేలమంది విద్యార్థులస్థాయికి విస్తృతం చేశామన్నారు.

అవయవ మార్పిడిలో మైలురాయి

బెంగళూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గ్లెనిగల్ బెంగళూరు ఆసుపత్రిలో అవయవ మార్పిడిలో ఓ మైలురాయిని సాధించామని, అసాధారణం అనిపించిన రోగులకు పునరుజ్జీవనం కల్పించామని ఆసుపత్రి నెఫ్రాలజిస్ట్ అనిల్ అభిప్రాయపడ్డారు. 50 అసాధారణ కేసులకు ఇటీవల గ్లెనిగల్ బృందం నిరంతర శస్త్ర చికిత్సలతో సాధ్యం చేశామన్నారు. అవయవదాత, గ్రహీత వేర్వేరు రక్త గ్రూపులు కలిగి ఉంటారు. వాటిని రోగనిరోధక ప్రతిచర్యల కారణంగా సవాళ్లను ఎదుర్కొంటారు. కొన్ని సంద ర్భాలలో స్వల్ప వ్యవధిలోనే కారణం కానుంది. బ్లడ్ గ్రూప్‌ల మ్యాచింగ్ ద్వారానే అవయవమార్పిడి శస్త్ర చికిత్సలు సాధ్యమవుతాయన్నారు. చీఫ్ యూరాలజిస్ట్ డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ అవయవమార్పిడిలో మా సాధనలను సంతోషంగా భావిస్తున్నామని తద్వారా ఎంతో మంది ఆరోగ్యంలో మెరుగు పరిచామనే సంతృప్తి ఉందన్నారు. క్లస్టర్ సీఈఓ బిజు నాయర్ అభిప్రాయం ప్రకారం అవయవమార్పిడిలో రాష్ట్రంలో నెంబరువన్‌గా సాధించడంలో వైద్యుల కఠోర శ్రమ ఉందన్నారు. ఇదే సందర్భంగా ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసుకున్నవారు అభిప్రాయాలు పంచుకున్నారు.



శస్త్రచికిత్స చేసుకున్నవారితో వైద్యబృందం

ప్రమాద సూచికలు ప్లీజ్..



ప్రమాదకరమైన మలుపు ఇదే...

చేళూరు, ఆగస్టు 20: చిలకలనేర్పు సమీపాన చేళూరు సమీపంలో అక్షర స్కూల్ వద్ద ప్రమాదకరమైన మలుపు ఉంది. మలుపు వద్ద అవసరమైన మేరకు స్పీడ్ బ్రేకర్‌లు, ప్రమాదసూచికలు ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు. ప్రమాదం జరిగాక బాధ పడడం కంటే ముందస్తు చర్యలకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

గుంతలరోడ్డును బాగుచేయండి



చాకవేలు బస్టాండ్ కూడలి

చేళూరు, ఆగస్టు 20: చాకవేలు బస్టాండ్ ప్రాంతం గుంతలమయంగా మారింది. రెండురోజులుగా ఒక మోస్తరు వర్షం కురవగా నీటితో నిండాయి. గుంతలన్నీ వర్షపునీటితో నిండడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. కంకర తేలిన గుంతల రోడ్లను బాగు చేయాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

అత్యాచారయత్నం ఘటనలో బాధితురాలిపై కేసు నమోదు

బెంగళూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కోరమంగలలో అత్యాచారయత్న వివాదంలో బాధితురాలిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. హెచ్ఎస్ఆర్ లే అవుట్‌కు చెందిన యువతి కోరమంగలలోని ఓ పబ్‌కు మిత్రుడితో పాటు వచ్చారు. శనివారం రాత్రి ఒంటిగంట తర్వాత మద్యం మత్తులో కారు నడిపి రెండు ఆటోలకు ఢీ కొన్నారు. ఆటో డ్రైవర్‌లు గొడవ చేస్తుండగా తప్పించుకునే యత్నంలో ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తిని లిఫ్ట్ అడిగారు. ఆ తర్వాత అతను నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి కిరాతకంగా వ్యవహరించారు. అయితే యువతి మత్తులో వాహనం నడిపి రెండు ఆటోలు, ఒక కారు, ఒక ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్నారని ఆటో డ్రైవర్‌ల ఫిర్యాదు మేరకు యువతితోపాటు ఆమె మిత్రుడిపైనా ఆడుగూడి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రస్తుతం బాధితురాలు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. కోలుకున్నాక విచారణకు పిలిపించే అవకాశం ఉంది.

పథకాలను సద్వియోగం చేసుకోండి



కుట్టుయంత్రాల పంపిణీ

శిడ్లఘట్ట, ఆగస్టు 20: వివిధ పథకాల ప్రయో జనం కోసం దళారులను ఆశ్రయించవద్దని ఎమ్మెల్యే బీఎన్ రవి కుమార్ సూచించారు. తాలూకా పంచాయతీ కార్యాలయంలో దేవరాజ్ అరసు అభివృద్ధి మండలి నుంచి వివిధ పథకాల లబ్ధిదారులకు కుట్టుమిషన్లు, ద్విచక్రవాహనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగా కల్యాణ పథకంలో కొన్ని చోట్ల అక్రమాలు జరగడం నా దృష్టికి వచ్చిందన్నారు. ఇకపై అక్రమాలు లేకుండా చూసుకుంటానన్నారు. మం డలి నుంచి 52మందికి కుట్టుయంత్రాలు, 20 మంది దివ్యాంగులకు ద్విచక్రవాహనాలను పంపిణీ చేశారు. తాలూకా పంచాయతీ ఈఓ హేమావతి, సీడీపీఓ విద్యా వస్త్రద్, మండలికి చెందిన శివానందరెడ్డి, జగదీశ్, జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు బంకు మునియప్ప పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ పవిత్రోత్సవాలు

ధర్మవరం, ఆగస్టు 20 : స్థానిక కొత్తపేటలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మంగళవారంతో ముగిశా యి. చివరి రోజు ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూ జలు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వ హించారు. అనంతరం నిత్యహోమాలతో పాటు వివిధ అభి షేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర సమర్ప ణ, మహా పూర్ణాహుతితో ఈ ఉత్సవాలు ముగిశాయి.